సాక్షి
కాకినాడ
మంగళవారం । 8 । ఏప్రిల్ । 2025



రూ.లక్ష విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి మందలపర్తి చంద్రశేఖర్ దంపతులు (భీమవరం) సోమవారం రూ.లక్ష విరాళం సమర్పించారు.




వెంకన్న పెళ్లికొడుకాయనె

వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాలు సోమవారం కన్నుల పండువగా ప్రారంభమయ్యాయి.

8లో

సాగుకు 9,100 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 9,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,400, మధ్య డెల్టాకు 1,900, పశ్చిమ డెల్టాకు 4,800 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.70 అడుగులకు చేరింది.

కూటమిలో కత్తులు

- బాబు డైరెక్షన్.. పవన్ యాక్షన్
- పిఠాపురంలో అన్నీ తానై చక్రం తిప్పుతున్న నాగబాబు
- పథకం ప్రకారమే మాజీ ఎమ్మెల్యే వర్మకు అవమానాలు
- సాగనంపడానికేనా అని అనుమానాలు
- నిన్నటి పొగడ్తలు ఏమయ్యాయని పవన్‌ను ప్రశ్నిస్తున్న తమ్ముళ్లు



ఈ నెల 4న గొల్లప్రోలులో నాగబాబు కాన్వాయ్‌ను అడ్డుకుని నినాదాలు చేస్తున్న టీడీపీ నేతలు.. ప్రతినినాదాలు చేస్తున్న జనసేన వర్గాలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: పిఠాపురం కూటమిలో కుమ్ములాటలు భగ్గుమంటున్నాయి. టీడీపీ, జనసేన శ్రేణులు బస్తీమే సవాల్ అంటూ కలబడుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల వరకూ జత కలిసే, జత కలిసే అంటూ చెట్టపట్టాలేసుకు తిరిగారు. తీరా అధికారం చేతికొచ్చేసరికి ఆధిపత్యం కోసం తలపడుతున్నారు. పిఠాపురంలో పెత్తనం తమదంటే తమదంటూ ఇరు పార్టీల నేతలూ రచ్చరచ్చ చేస్తున్నారు. చివరకు అధికారిక కార్యక్రమాల్లో కూడా తోపులాటలకు, తన్నులాటలకు దిగుతూండటాన్ని చూసి పిఠాపురం జనం ముక్కున వేలేసుకుంటున్నారు. పిఠాపురం కేంద్రంగా అధికారం, పెత్తనం చెలాయించేందుకు ఇరు పార్టీల నేతలు ఎత్తులకు పై ఎత్తులు వేసుకుంటూ ప్రగతిని విస్మరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పొమ్మనకుండా పొగ

పిఠాపురం సీటును త్యాగం చేసి, పవన్ గెలుపులో కీలకంగా వ్యవహరించిన మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మకు పొమ్మనకుండా పొగబెడుతున్నారని ఆయన అనుయాయులు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. అధికారిక కార్యక్రమాల్లో ఆయన పేరు వినిపించకుండా చేయాలనేది జనసేన వ్యూహం. ఇందుకు పక్కా కార్యాచరణ పవన్ డిప్యూటీ సీఎం అయిన దగ్గర నుంచి చాప కింద నీరులా సిద్ధం చేస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక తొలి ఎమ్మెల్సీ వర్మకు అని స్వయంగా చంద్రబాబే ప్రకటించారు. అటువంటిది వరుసగా ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నాయి, ఎవరెవరో ఎమ్మెల్సీలు అవుతున్నారు. కానీ చంద్రబాబు మాట ఇచ్చిన వర్మకు మాత్రం ఎమ్మెల్సీ ఇవ్వకపోగా.. మిత్రపక్షమైన జనసేన నుంచి అడుగడుగునా అవమానాలే ఎదురవుతున్నాయి. బాబు మాట ఇచ్చిన వర్మను పక్కన పెట్టి పవన్ సోదరుడు నాగబాబుకు ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టారు. ఎమ్మెల్సీ అయ్యాక పిఠాపురం శివారు చిత్రాడలో గత నెలలో జరిగిన జనసేన ఆవిర్భావ సభ వేదిక నుంచి నాగబాబు చేసిన వ్యాఖ్యలు చిచ్చు రేపాయి. జనసేన నాయకులు, శ్రేణులు, పిఠాపురం ప్రజలతోనే పవన్ గెలిచారని, అలా కాకుండా మరెవరైనా తన వల్లే పవన్ గెలిచారనుకుంటే అది వారి 'ఖర్మ' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యల మర్మం ఇప్పుడు అర్థమవుతోందని వర్మ అనుయాయులు మండిపడుతున్నారు.

నాడు ఎత్తేసి.. నేడు తొక్కేసి..

ఎన్నికలు ముగిసి ఫలితాలు వచ్చేంత వరకూ వర్మను సోదరద్వయం నాగబాబు, పవన్‌లు ఆకాశానికెత్తేసి, పొగడ్తలతో ముంచెత్తారు. తీరా అధికారం అందుకున్న తరువాత వారు ప్లేటు ఫిరాయించేసి, అనుచరులను ఉసిగొల్పుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. రాజకీయంగా పాతాళానికి తొక్కేసేందుకే వర్మను కాదని నాగబాబుకు ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టారు. ఇప్పుడు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించడం కూడా వర్మను సాగనంపే వ్యూహంలో భాగమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. నియోజకవర్గంలో భారీ మెజార్టీతో స్వతంత్ర ఎమ్మెల్యేగా గెలుపొందిన వర్మను ఉద్దేశపూర్వకంగానే అడుగడుగునా అవమానాలకు గురి చేస్తున్నట్లు కనిపిస్తోంది. పవన్ తరఫున అన్నీ తానై పిఠాపురంలో అధికార, అనధికార కార్యక్రమాల్లో చక్రం తిప్పుతున్న నాగబాబు కనుసన్నల్లోనే ఈ కుట్రంతా జరుగుతోందని వర్మ అనుయాయులు రగిలిపోతున్నారు. ఎమ్మెల్సీ ఇస్తానన్న చంద్రబాబు మాట తప్పినప్పుడే పవన్‌తో కలిసిపోయి రాజకీయంగా తమ నాయకుడిని తొక్కేయాలనే నిర్ణయానికి వచ్చారని వారంటున్నారు. చంద్రబాబు డైరెక్షన్‌లో పవన్ రూపొందించిన పక్కా పథకాన్ని నాగబాబును ముందుంచి నడిపిస్తున్నారు. లేదంటే ఎన్నికల ముందు 'వర్మతోనే తన గెలుపు' అంటూ గంభీరోపన్యాసం చేసిన పవన్.. తన సమక్షంలోనే వర్మపై పరోక్షంగా అవమానకరమైన రీతిలో నాగబాబు వ్యాఖ్యలు చేస్తే కిమ్మనకపోవడమేమిటనే ప్రశ్న కూటమి నేతల నుంచే వ్యక్తమవుతోంది.

ఆహ్వానించకుండా అవమానాలు

నియోజకవర్గంలో జరుగుతున్న అధికారిక కార్యక్రమాలకు కూటమి భాగస్వామ్య పార్టీ ప్రతినిధిగా వర్మకు కనీస ఆహ్వానం కూడా పంపించడం లేదు. నియోజకవర్గ రాజకీయాల్లో తమ నాయకుడి పేరు ఎక్కడా వినిపించకుండా చేయాలనేదే జనసేన వ్యూహమైతే అందుకు తగినట్లుగానే స్పందిస్తామని వర్మ అనుచరులు అంటున్నారు. తమ రెక్కల కష్టంపై గెలిచిన పవన్.. ఇప్పుడు తమ నాయకుడిని అడుగడుగునా ఇలా అవమానాలకు గురి చేయడమేమిటని నిలదీస్తున్నారు. తాజాగా జరిగిన నాగబాబు పర్యటన సందర్భంగా గొల్లప్రోలు మండలం చిన జగ్గంపేటకు చెందిన జనసేన నేత మొయిళ్ల నాగబాబును అడ్డుకుని, దాడి చేశారంటూ టీడీపీ కార్యకర్తలపై పోలీసు కేసు పెట్టి, అరెస్టు చేయించారని ఆరోపిస్తున్నారు. రాజకీయంగా వర్మకు ప్రాధాన్యం లేకుండా చేయాలనే ఏకైక అజెండాతోనే పవన్, నాగబాబుల మార్గదర్శకత్వంలో జనసేన శ్రేణులు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో పిఠాపురం సీటు వర్మకు ఇవ్వలేదనే ఆగ్రహంతో ఆయన అనుచరగణం అప్పట్లో చంద్రబాబు దిష్టిబొమ్మను, టీడీపీ జెండాలను తగులబెట్టారు. అప్పట్లో వారు చంద్రబాబు, లోకేష్‌లపై చేసిన వ్యాఖ్యలు నాడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. వీటన్నింటినీ మనసులో పెట్టుకునే తమ నాయకుడిని పూర్తిగా తొక్కేయాలనే లక్ష్యంతో పవన్‌తో కలిసి చంద్రబాబు ఈ కుట్రలు చేస్తున్నారని వర్మ అనుచరులు మండిపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఇటీవల రెండు రోజుల పాటు నాగబాబు పాల్గొన్న అధికార కార్యక్రమాలను వర్మ అనుచరులు అడ్డుకున్నారు. ఇరు పార్టీల నాయకుల సవాళ్లు, ప్రతిసవాళ్లతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం రావణకాష్టంలా మారింది.

గ్రాసిమ్ నుంచి ముడుపుల కోసమే..

- అందుకే అసెంబ్లీ వేదికగా క్యాన్సర్ ప్రచారం
- అనపర్తి ఎమ్మెల్యే అత్యుత్సాహం బలభద్రపురానికి శాపం
- వైఎస్సార్ సీపీ నేత డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ధ్వజం



డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామంలో గ్రాసిమ్ ఇండస్ట్రీ యాజమాన్యాన్ని భయభ్రాంతులకు గురి చేసి, వారి నుంచి ముడుపులు పొందడమే ధ్యేయంగా అసెంబ్లీ వేదికగా అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి క్యాన్సర్ ప్రచారం చేశారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆరోపించారు. అంతే తప్ప బలభద్రపురం, పరిసర ప్రాంత ప్రజల క్షేమం కోరి కాదని అన్నారు. అనపర్తిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే నల్లమిల్లి లేవనెత్తిన క్యాన్సర్ అంశం బలభద్రపురానికి శాపంగా మారిందని ధ్వజమెత్తారు. ఇటీవల ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మాట్లాడినట్టుగా క్యాన్సర్‌పై ముందే ప్రైవేటు సంస్థలతో సర్వేలు చేయించి, అప్పుడు అసెంబ్లీలో ప్రస్తావిస్తే బాగుండేదని అన్నారు. అలా కాకుండా బలభద్రపురంలో 200 మందికి పైగా క్యాన్సర్ బాధిత కుటుంబాలను పరామర్శించానంటూ ఎమ్మెల్యే చెప్పారని, దీనిలో నిజం ఎంతుందో ఆయనకే తెలుసని అన్నారు.

తప్పుడు ప్రచారంతో ఊరికి చేటు

అసెంబ్లీలో రామకృష్ణారెడ్డి క్యాన్సర్ అంశాన్ని ప్రస్తావించడం, దానిపై మీడియా అత్యుత్సాహంతో విపరీత ప్రచారం కల్పించడంతో బలభద్రపురం ప్రాంతాన్ని క్యాన్సర్ భూతం కబళించిందేమో అనే స్థాయిలో రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరిగిందని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఈ ప్రచారంతో ఆ గ్రామంలోని తమ వారి ఇళ్లకు రావటానికి ఇతర ప్రాంతాల్లోని బంధువులు భయపడుతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. ఒక వేళ వచ్చినా కనీసం మంచినీళ్లు తాగడానికి కూడా భయపడిపోతున్నారన్నారు. అలాగే, ఆ ఊరి వారితో వివాహ సంబంధాలు కలుపుకోవాలన్నా బయటి గ్రామాల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బలభద్రపురంలో వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందితో సర్వే చేస్తూంటే, వారిని కూడా బెదిరించి విషయాన్ని పక్కతోవ పట్టిస్తూ లేనిది ఉన్నట్లుగా చూపించేందుకు ఎమ్మెల్యే విఫలయత్నం చేశారని మాజీ ఎమ్మెల్యే దుయ్యబట్టారు. ప్రభుత్వ సర్వేలో జాతీయ సగటు కంటే తక్కువగా బలభద్రపురంలో క్యాన్సర్ కేసులు నమోదయ్యాయని, సాక్షాత్తూ బీజేపీ ఎమ్మెల్యే, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ప్రకటించారని గుర్తు చేశారు. డైవర్షన్ రాజకీయాలకు అలవాటు పడిన ఎమ్మెల్యే నల్లమిల్లి ఇంకా స్వతంత్ర సర్వే అంటూ, అసలు విషయాన్ని పక్కదారి పట్టించాలని చూస్తున్నారని విమర్శించారు.

గ్రాసిమ్ ఇండస్ట్రీ ఏర్పాటు సమయంలో జరిగిన విషయాలన్నీ ప్రజలకు తెలుసునని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి చెప్పారు. 2019 ప్రథమార్థంలోనే నాటి, నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాంలోనే కేపీఆర్ సంస్థ నుంచి గ్రాసిమ్ సంస్థకు భూబదలాయింపు చేశారన్నారు. ఆ తర్వాత వెంటనే దొంతమూరులో జరిగిన అఖిలపక్ష సమావేశంలో అప్పటి, ఇప్పటి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వారం రోజుల్లో భూబదలాయింపు ఉత్తర్వులు రద్దు చేయిస్తానని చెప్పి, ఆ పని ఎందుకు చేయించలేకపోయారని, దీని వెనుక ఉన్న ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. గ్రాసిమ్ ఇండస్ట్రీ వలన ప్రజలకు ఏదైనా ఇబ్బంది కలిగితే, అధికారంలో ఉన్నందున చిత్తశుద్ధి ఉంటే తగిన చర్యలు తీసుకోవచ్చని సూచించారు. అంతే తప్ప అవగాహన లేకుండా బలభద్రపురానికి, పరిసర ప్రాంతాలకు మాయని మచ్చ తీసుకు రావద్దని హితవు పలికారు. ప్రజలు భయాందోళనలకు గురి కావద్దని, అంతా మంచి జరుగుతుందని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి అన్నారు.

లక్ష్మీ.. రావేం మా కొండకి?

- రత్నగిరి వాసుడిని కటాక్షించని శ్రీమహాలక్ష్మి
- ఖర్చుకు రూ.6 కోట్ల దూరంలో సత్తెన్న ఆదాయం
- 2024-25లో రాబడి రూ.135 కోట్లు
- వ్యయం రూ.1.41 కోట్లు
- అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ఆదాయానికి భారీగా గండి



అన్నవరం: అనుకున్నదే జరిగింది.. రత్నగిరి వాసుడు సత్యదేవుడిని లక్ష్మీదేవి పూర్తి స్థాయిలో కరుణించలేదు. ఫలితంగా ఒకప్పుడు మిగులు నిధులతో, సిరిసంపదలతో తులతూగిన అన్నవరం దేవస్థానంలో ఇప్పుడు రాబడి తగ్గి, ఖర్చు పెరిగింది. ఫలితంగా 2024-25లో వ్యయం కన్నా వార్షికాదాయం రూ.6 కోట్లు తక్కువగా నమోదైంది. గత ఏడాది సగం గడిచినప్పటి నుంచే ఈ పరిస్థితి కనిపిస్తున్నా చక్కదిద్దడంలో అధికారులు విఫలమవడం.. వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవడంతో దేవస్థానం ఆర్థిక పరిస్థితి దిగజారింది. 2019–24 మధ్య ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో కరోనా విపత్తు రెండేళ్ల పంజా విసిరి, భక్తుల రాక తగ్గినా.. దేవస్థానం ఆదాయంపై ఆ ప్రభావం పడలేదు. అటువంటిది కూటమి పది నెలల పాలనలో అంతా సజావుగా ఉన్నా ఆదాయం పెరగకపోవడం గమనార్హం.

ఖర్చయిపోయిందిలా..

అన్నవరం దేవస్థానానికి 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.135,69,42,831 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఖర్చు వ్యయం రూ.141,49,16, 971 అయింది. దీంతో దేవస్థానం ఆదాయం కన్నా వ్యయం సుమారు రూ.6 కోట్లు అధికంగా నమోదైంది. ఇటీవలి కాలంలో ఈవిధంగా ఆదాయం తగ్గి, ఖర్చు పెరగడం ఇదే ప్రథమం.

ప్రదక్షిణ దర్శనం రద్దుతో రూ.5 కోట్ల నష్టం

సత్యదేవుని ఆలయంలో రూ.300 టికెట్టుతో ప్రదక్షిణ దర్శనాన్ని 2023లో అప్పటి ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ ప్రారంభించారు. ఆలయంలో నాలుగు మూలలా శ్రీగంధం గిన్నె, లక్ష్మీ హుండీ, పారిజాత వృక్షం, కామధేనువు విగ్రహాలను ఏర్పాటు చేశారు. భక్తులు ఈ ప్రదక్షిణ దర్శనానికి మొగ్గు చూపేవారు. 2023 అక్టోబర్‌లో ఈ దర్శనం ప్రారంభిస్తే నెల రోజుల్లోనే సుమారు రూ.50 లక్షల ఆదాయం వచ్చింది. అయితే, ఆజాద్ బదిలీ తరువాత ఈఓగా వచ్చిన కె.రామచంద్ర మోహన్ ఈ దర్శనాన్ని నిలిపివేశారు. ఆయన తరువాత ఈఓగా వచ్చిన వీర్ల సుబ్బారావు కూడా దీనిని పునరుద్ధరించలేదు. ఈ ప్రదక్షిణ దర్శనం అర్ధాంతరంగా నిలిచిపోవడంతో దేవస్థానం ఏటా సుమారు రూ.6 కోట్ల మేర ఆదాయం కోల్పోయింది.

2024-25 ఆర్థిక సంవత్సరం ఆదాయ వ్యయాల వివరాలు

ఆదాయం	రూ.కోట్లలో
వ్రతాలు	38.40
ప్రసాదాల విక్రయం	33.07
హుండీల ద్వారా	18.79
షాపుల వేలం, లీజులు	15.77
వసతి గదుల అద్దెలు	12.27
ప్రత్యేక దర్శనం టిక్కెట్లు	5.49
ఇతర ఆర్జిత సేవలు	4.13
ట్రాన్స్‌పోర్టు	2.03
డిపాజిట్లపై వడ్డీలు	4.80
కేశఖండన టికెట్ల ద్వారా	00.94
మొత్తం (సుమారు)	135.69
అడ్వాన్సులు, డిపాజిట్లు, క్యాపిటల్ డొనేషన్లు	7.20

వ్యయం

కేటగిరీ	రూ.కోట్లలో
సిబ్బంది జీతభత్యాలు	23.35
పెన్షన్లు	13.71
కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్	8.10
ప్రసాదం సరకుల కొనుగోళ్లు	23.17
వ్రతాల విభాగం కొనుగోళ్లు	5.05
పడితరం, పూజలు	00.51
ఉత్సవాల ఏర్పాట్లు	1.63
పురోహితులు, ఇతరుల పారితోషికాలు	16.00
శానిటేషన్	6.60
ధర్మ ప్రచారం	00.50
ఎలక్ట్రికల్ వాటర్ వర్క్స్	2.11
ట్రాన్స్‌పోర్టు	1.43
విద్యాసంస్థలు, దత్తత ఆలయాలు	5.09
ఎస్‌పీఎఫ్, సెక్యూరిటీ గార్డులు	4.36
సీజీఎఫ్, ఇతర చెల్లింపులు	12.49
వివిధ నిర్మాణాలు	12.75
ఎలక్ట్రికల్ వర్క్స్ కొనుగోళ్లు	4.53
ఇతర ఖర్చులు	00.04
మొత్తం (సుమారు)	141.49

ఇతర వ్యయాలు, అడ్వాన్సులు, డిపాజిట్లు రూ.6.05 కోట్లు

గత ఏడాది మిగులుతో వ్యయాల సర్దుబాటు

గత ఏడాది రూ.7 కోట్లు మిగలడంతో ఆ మొత్తంలో రూ.6 కోట్లు ఈ ఏడాది వ్యయాలకు సర్దారు. 12 ఏళ్ల క్రితం కూడా ఇదే విధమైన పరిస్థితి ఏర్పడింది. అయితే అప్పుడు వ్యయం రూ.కోటి మాత్రమే ఎక్కువైంది. వైఎస్సార్ సీపీ పరిపాలనలో 2020, 2021 సంవత్సరాల్లో కరోనా వైరస్ కారణంగా ఆదాయం తగ్గినప్పటికీ దేవస్థానం వెంటనే రికవరీ అవడంతో లోటు కనిపించలేదు. అధికారుల అనాలోచిత నిర్ణయాలు, చిన్నచిన్న విషయాలను కూడా పెద్ద వివాదాలుగా మార్చడం, దేవస్థానంపై పూర్తి స్థాయిలో అవగాహన లేకపోయినా సిబ్బంది సలహాల ప్రకారం కాకుండా సొంత అజెండాతో వ్యవహరించడం వంటి చర్యలతో దేవస్థానం ప్రతిష్ట మసకబారుతోంది. ఫలితంగా భక్తుల రాక తగ్గి, ఆదాయం తగ్గుతోంది. ఇటీవల అధికారులు తీసుకున్న నిర్ణయమే దీనికి తాజా ఉదాహరణ. నీటి సమస్య సాకుతో ఏసీ గదులను ఒక రోజు అద్దెకివ్వకపోవడంతో దేవస్థానం సుమారు రూ.లక్ష ఆదాయం కోల్పోయింది. ఆ తరువాత ఏసీ గదులు అద్దెకివ్వడం పునరుద్ధరించినా ఇప్పటికీ వాటిని అద్దెకివ్వడం లేదనే భావనే భక్తుల్లో ఉంది.

న్యూస్‌రీల్

బీచ్‌లో భారీ పోలీసు బందోబస్తు



బందోబస్తు విధులకు సిద్ధమవుతున్న పోలీసులు

కాకినాడ రూరల్: భారత్ – అమెరికా సంయుక్త సైనిక విన్యాసాల నేపథ్యంలో కాకినాడ రూరల్ సూర్యారావుపేట బీచ్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి నుంచి బీచ్ రోడ్డును మూసివేశారు. దీంతో లైట్ హౌస్ మీదుగా బీచ్ రోడ్డులో ఉప్పాడకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ నెల 13వ తేదీ వరకూ బీచ్ రోడ్డులో రాకపోకలు నిలిపివేయడంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు బీచ్‌కు రాకుండా నిషేధించారు. సుమారు డీఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, రూరల్ సీఐ చైతన్యకృష్ణ, తిమ్మాపురం ఎస్‌హెచ్‌ఓ, ట్రైనీ ఐపీఎస్ అధికారి సుష్మితలు బీచ్‌లో 130 మంది సిబ్బందికి విధులు కేటాయించారు.

స్తంభించిన ఎన్టీఆర్ వైద్య సేవలు

కాకినాడ క్రైం: జిల్లావ్యాప్తంగా ఎన్టీఆర్ వైద్య సేవలు (ఆరోగ్యశ్రీ) సోమవారం స్తంభించిపోయాయి. ప్రభుత్వ నిర్వాకంతో నెట్‌వర్క్ ఆస్పత్రులు తలపెట్టిన సమ్మె పేదల ఆరోగ్యంపై గుదిబండగా మారింది. జిల్లావ్యాప్తంగా ప్రతి రోజూ ఎన్టీఆర్ వైద్య సేవల కింద కార్పొరేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో 80 నుంచి 110 సర్జరీలు ఉచితంగా జరుగుతూంటాయి. అటువంటిది సోమవారం ఒక్క సర్జరీ కూడా నమోదు కాలేదు. జిల్లాకు రావలసిన సుమారు రూ.150 కోట్ల బకాయిలను ప్రభుత్వం విడుదల చేసేంత వరకూ సమ్మె విరమించేది లేదని ఏపీ స్పెషాలిటీ అసోసియేషన్ నాయకులు వెల్లడించారు. ప్రభుత్వం చర్చలకు పిలిచిందని, రాష్ట్ర నాయకత్వం హాజరు కానుందని, చర్చల అనంతరం కొనసాగింపుపై మరింత స్పష్టత వస్తుందని వారు తెలిపారు.

స్వయం ఉపాధికి దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ సిటీ: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జె.సత్యవతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు 3,318.25 లక్షల విలువైన 798 యూనిట్లు మంజూరు చేశారన్నారు. వీటికి సబ్సిడీ కింద రూ.1310.10 లక్షలు, బ్యాంకు రుణం రూ.1,824.24 లక్షలు, లబ్ధిదారు వాటా రూ.165.91 లక్షలుగా నిర్ణయించారని వివరించారు. దీని ద్వారా ఎస్సీ నిరుద్యోగ యువతకు రూ.2.50 లక్షల నుంచి రూ.20 లక్షల విలువైన 32 రకాల స్వయం ఉపాధి పథకాలు అమలు చేస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న ఎస్సీ యువత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత వెబ్‌సైట్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఈ నెల 14 నుంచి అందుబాటులోకి వస్తుందని, దీని ద్వారా వచ్చే నెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. పూర్తి వివరాలకు సంబంధిత ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్ కార్యాలయాల్లో సంప్రదించాలని సత్యవతి సూచించారు.

పీజీఆర్ఎస్‌కు 478 అర్జీలు



మహిళల సమస్యలు వింటున్న కలెక్టర్ షణ్మోహన్, జేసీ రాహుల్ మీనా

కాకినాడ సిటీ: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ప్రజలు 478 అర్జీలు సమర్పించారు. వారి నుంచి కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ, జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు, సీపీఓ పి.త్రినాథ్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు, కేఎస్ఈజెడ్ ఎస్‌డీసీ కేవీ రామలక్ష్మి తదితరులు అర్జీలు స్వీకరించారు. వీటికి సత్వరమే సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

శ్రీనూకాంబిక ఆలయ అభివృద్ధికి విరాళం

ఆలమూరు: చింతలూరు నూకాంబికా అమ్మవారి ఆలయ అభివృద్ధికి గుమ్మిలేరుకు చెందిన వ్యాపారవేత్త ముత్యాల వీర భాస్కరరావు, కృష్ణవేణి దంపతులు సోమవారం రూ.1,01,116 అందజేశారు. గాలి గోపురం నిర్మాణానికి ఈ విరాళం ఇచ్చారు. ఈఓ ఉండవల్లి వీర్రాజు చౌదరి, ఉత్సవ కమిటీ చైర్మన్ గన్ని వెంకట్రావు (అబ్బు)కు నగదు రూపంలో ఆలయ ఆవరణలో అందజేశారు.

'సాక్షి' తోడుగా.. దేవస్థానానికి ఆదా

- రత్నగిరిపై నెలకు రూ.23,990కే 'చెత్త' ట్రాక్టర్ కాంట్రాక్ట్ ఖరారు
- గతంలో టెండర్ లేకుండానే రూ.60 వేలకు అప్పగింత
- దీనిపై 'సాక్షి' కథనం
- స్పందించి టెండర్ పిలిచిన అధికారులు
- తాజాగా మరింత తక్కువకు కొటేషన్
- దేవస్థానానికి నెలకు రూ.36,010 మిగులు


రత్నగిరిపై 'చెత్త' వివాదం

మార్చి 28న 'సాక్షి' ప్రచురించిన కథనం

సాక్షి ఇంపాక్ట్

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో ట్రాక్టర్‌తో చెత్త తరలించేందుకు గాను నెలకు రూ.23,990కు టెండర్ ఖరారైంది. దీనికి సంబంధించిన వివరాలివీ.. రత్నగిరిపై సత్యదేవుని వ్రతాల్లో ఉపయోగించిన పత్రి, పువ్వులు, తమలపాకులతో పాటు ఆలయ ప్రాంగణంలో చెత్తను తరలించే పనిని గతంలో శానిటరీ కాంట్రాక్టర్ నిర్వహించేవారు. గత ఫిబ్రవరి నెలాఖరు వరకూ ఈ కాంట్రాక్ట్ నిర్వహించిన కేఎల్‌టీఎస్ సంస్థ మార్చి 1 నుంచి వైదొలగింది. దీంతో, దేవస్థానంలో చెత్త తరలింపునకు ఒక ట్రాక్టర్, రెండు ట్రక్కులు, ట్రాక్టర్‌కు అవసరమయ్యే డీజిల్, ఇతర నిర్వహణ ఖర్చులు భరించేలా నెలకు రూ.60 వేలకు నామినేషన్ పద్ధతిలో అప్పగించారు. టీడీపీలోని ఒక ద్వితీయ శ్రేణి నాయకుడి సిఫారసుతో ఆ పార్టీ కార్యకర్తకు ఏకపక్షంగా ఈ పనిని అప్పగించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. గతంలో చెత్త ట్రాక్టర్ నిర్వహించిన యడ్ల కృష్ణ అనే వ్యక్తి తాను నెలకు రూ.43 వేలకే చెత్త తరలిస్తానని లిఖితపూర్వకంగా తెలియజేసినా దేవస్థానం అధికారులు స్పందించలేదు. ఈ వ్యవహారంపై 'రత్నగిరిపై చెత్త వివాదం' శీర్షికన మార్చి 28న 'సాక్షి' కథనం ప్రచురించింది. దీంతో విధి లేని పరిస్థితిలో స్పందించిన అధికారులు చెత్త తరలింపునకు టెండర్ పిలిచారు. ఈ టెండర్లను సోమవారం తెరవగా నాలుగు కొటేషన్లు వచ్చాయి. వీటిలో అతి తక్కువగా నెలకు రూ.23,990కే దాఖలైన టెండర్‌ను ఖరారు చేశారు. 'సాక్షి' కథనం కారణంగా దేవస్థానానికి నెలకు రూ.36,010, సంవత్సరానికి రూ.4,32,120 మేర ఆదా అయ్యింది.

శానిటేషన్ టెండర్ పిలిస్తే రూ.లక్షల్లో ఆదా

చెత్త ట్రాక్టర్ టెండర్‌లోనే దేవస్థానానికి నెలకు రూ.36,010 ఆదా కాగా, ఇక శానిటేషన్ టెండర్ కూడా పిలిస్తే రూ.లక్షల్లో ఆదా అయ్యే అవకాశం ఉంది. దేవస్థానంలో పారిశుధ్య నిర్వహణకు ఎటువంటి టెండర్ పిలవకుండానే నామినేషన్ పద్ధతిలో గుంటూరుకు చెందిన కనకదుర్గ సర్వీసెస్ సంస్థకు 349 మంది పని వారిని సమకూర్చే పనిని అప్పగించారు. వాస్తవానికి దీనిని కూడా టెండర్ ద్వారానే చేయాల్సి ఉంది. ప్రస్తుతం దేవస్థానం అధికారులు శానిటరీ మెటీరియల్ సూపర్‌బజార్‌లో కొనుగోలు చేస్తున్నారు. పారిశుధ్య నిర్వహణకు సుమారు రూ.50 లక్షలకు పైగా ఖర్చు చేస్తున్నారు. దీనికి ఉన్నతాధికారులు అనుమతి ఇచ్చినా భవిష్యత్తులో ఆడిట్ అభ్యంతరాలు వ్యక్తమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో శానిటేషన్ కాంట్రాక్టుకు కూడా టెండర్ పిలిస్తే దేవస్థానానికి నెలకు రూ.10 లక్షల వరకూ మిగిలే అవకాశం ఉంది. దీనిపై అధికారులు దృష్టి పెట్టాల్సి ఉంది.

జాతీయ కళా డాక్యుమెంటరీ ప్రోగ్రాంలో కోనసీమ కళాకారులు



న్యూఢిల్లీలో డాక్యుమెంటరీ ప్రోగ్రాంలో కళాకారులు

కొత్తపేట: దేశవ్యాప్త కళాకారులతో న్యూఢిల్లీలో రెండు రోజుల పాటు జరిగిన డాక్యుమెంటరీ ప్రోగ్రాంలో రాష్ట్రం నుంచి కోనసీమ జిల్లాకు చెందిన ఇద్దరు గరగ నృత్యం కళాకారులు పాల్గొన్నారు. కొత్తపేట మండలం పలివెలకు చెందిన కొమారిపాటి ఏసువెంకటప్రసాద్, మండపేట రూరల్ మండలం తాపేశ్వరానికి చెందిన కొరివి కళ్యాణ్‌కు ఈ అవకాశం దక్కింది. ఈ ఏడాది జనవరి 26న భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలో దేశ వ్యాప్తంగా వివిధ కళారూపాలకు చెందిన 5,196 మంది కళాకారులు పాల్గొని ప్రదర్శనలు ఇచ్చారు. ఆ కార్యక్రమం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదైంది. కాగా ఢిల్లీలోని భారత సంగీత, నాటక అకాడమీ ఆధ్వర్యంలో ఆయా కళాబృందాల్లో ఒక్కో బృందం నుంచి ఇద్దరి చొప్పున మొత్తం 100 మందిని ఎంపిక చేసి 'జయతి జై మమహ భారతం' పేరుతో డాక్యుమెంటరీ ప్రోగ్రాం చేశారు. ఇందులో కోనసీమ జిల్లాకు చెందిన ఏసువెంకటప్రసాద్, కళ్యాణ్ గరగ నృత్యం ప్రదర్శించారు. ఈ సందర్భంగా సంగీత నాటక అకాడమీ చైర్మన్ సంధ్యాపుణిచ, సెక్రటరీ రాజుదాస్ తదితర ప్రముఖులు అభినందించి, సర్టిఫికెట్లు అందజేశారు. ఏసు వెంకటప్రసాద్ గరగ నృత్యం జానపద కళా విభాగంలో సీఎం చంద్రబాబు, మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారాన్ని కూడా అందుకున్నారు.

క్లుప్తంగా

గల్లంతైన యువకుడి మృతదేహం గుర్తింపు



కాలువలో దొరికిన షేక్ ఖాదర్ మృతదేహం



మృతి చెందిన షేక్ ఖాదర్ (ఫైల్)

రావులపాలెం: స్నేహితులతో సరదాగా గోపాలపురం కాలువ వద్ద స్థానానికి వెళ్లి గల్లంతయిన యువకుడు షేక్ ఖాదర్ (21) మృతదేహం సోమవారం సంఘటన ప్రాంతానికి వంద మీటర్ల దూరంలో కాలువలో గుర్తించారు. ఆదివారం మధ్యాహ్నం గోపాలపురం ఆరుమామిళ్ల గట్టు రేవు వద్ద స్నానానికి దిగిన ఖాదర్ గల్లంతైన విషయం తెలిసిందే. సోమవారం ఉదయం రేవుకు 100 మీటర్ల దూరంలో మృతదేహం తేలడంతో ఖాదర్ బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో మృతదేహాన్ని కొత్తపేట ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు టౌన్ సీఐ శేఖర్‌బాబు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించగా స్థానిక నెక్కంటి కాలనీలో ఉన్న బరియల్ గ్రౌండ్‌లో ఖననం చేసినట్టు బంధువులు తెలిపారు.

బాయిలర్ డ్రైన్‌లో పడి వ్యక్తి మృతి

పెద్దాపురం: బాయిలర్ డ్రైన్‌లో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన స్థానిక వాలు తిమ్మాపురం రహదారిలో ఉన్న పట్టాభి ఆగ్రో ఫుడ్స్ రైస్ మిల్లులో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ నగరానికి చెందిన వేముల శివ (29) ఫ్యాక్టరీకి పనిమీద వచ్చి, ప్రమాదవశాత్తూ కాలు జారి కాలువలో పడిపోయాడు. ఇంతలో బాయిలర్ నుంచి విడుదలైన వేడినీటి కారణంగా అతడు మృతి చెందినట్టు తెలుస్తోంది. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై ఎస్ఐ మౌనిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెంకన్న పెళ్లికొడుకాయెనే

ఘనంగా ప్రారంభమైన కోనేటి రాయుడి కల్యాణోత్సవాలు

కొత్తపేట: కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిచెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాలు సోమవారం కన్నుల పండువగా ప్రారంభమయ్యాయి. దేవదాయ – ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో కల్యాణ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు, భక్తులకు సౌకర్యాలు కల్పించారు. ఉత్సవాల్లో భాగంగా శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో మిరుమిట్లు గొలిపేలా సుందరంగా అలంకరించారు. బొబ్బర్లంక – రావులపాలెం ప్రధాన రహదారి నుంచి వాడపల్లికి వెళ్లే రహదారుల ముఖద్వారాల్లో కల్యాణోత్సవ స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంతశ్రీనివాస్ ఆధ్వర్యంలో వేద పండితులు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు, ఆలయ అర్చకులు స్వామివారిని వేకువ జామున పెండ్లి కుమారునిగా అలంకరించారు. వేద పండితుల మంత్రాలు, మేళతాళాల నడుమ ఈ వేడుక నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను వారి గోత్ర నామాలతో పెండ్లి కుమార్తెలుగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ధ్వజారోహణ, అంకురార్పణ నిర్వహిస్తున్న పండితులు

సాయంత్రం 6–15 గంటలకు స్వామివారి ధ్వజారోహణ, అంకురార్పణ, నిత్య బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఆర్డీఓ పీ శ్రీకర్, సీఐ సీహెచ్ విద్యాసాగర్ కల్యాణోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు.

నేడు స్వామివారి కల్యాణోత్సవం

వాడపల్లి క్షేత్ర ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాన్ని మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించనున్నట్టు డీసీ అండ్ ఈఓ చక్రధరరావు తెలిపారు. ఆ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మధ్యాహ్నం 3గంటలకు స్వామి వారి రథోత్సవం నిర్వహించనున్నామన్నారు. ప్రజాప్రతినిదులు, నాయకులు, అధికారులతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. రథోత్సవం, కల్యాణ వేడుకల్లో భక్తులకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నారు.



విద్యుత్ దీపాల అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రం

పట్టా పండగకు సన్నాహాలు

- జేఎన్‌టీయూకే 11వ స్నాతకోత్సవానికి నోటిఫికేషన్
- దరఖాస్తులకు తుది గడువు 15వ తేదీ
- గవర్నర్‌కు ఆహ్వానం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ కాకినాడ 11వ స్నాతకోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు విద్యార్థులు ఒరిజనల్ డిగ్రీ కోసం ఏప్రిల్ 15 తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని వర్సిటీ వెబ్ సైట్‌లో సూచించారు. గత మార్చి 1వ తేదీన నోటిఫికేషన్ జారీచేయగా తుది గడువు మార్చి 30వ తేదీతో ముగియగా అభ్యర్థులు తక్కువగా దరఖాస్తు చేసుకోవడంతో మరో 15రోజులపాటు ఏప్రిల్ 15వ తేదీ వరకూ గడువు పెంచారు. దీంతో ప్రముఖుల చేతుల మీదుగా సంప్రదాయ వస్త్రధారణలో పట్టా(ఒరిజనల్ డిగ్రీ) అందుకోవాలని కలలు కంటున్న విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రెండు మూడు సంవత్సరాలకు ఒకసారి కలిపి స్నాతకోత్సవం నిర్వహిస్తుండేవారు. ఈ విధానానికి స్వస్తిపలికి ప్రతి ఏడాది వేడుకలు నిర్వహించాలనే ఉద్దేశంతో అప్పటి వీసీ ప్రసాదరాజు 2022లో 8వ కాన్వోకేషన్, 23లో 9, గత ఏడాది జనవరి 31వ తేదిన 10వ కాన్వోకేషన్ నిర్వహించారు. అప్పటి వరకూ పెండింగ్‌లో ఉన్న పట్టాలనీ ఈ కాన్వోకేషన్‌లో జారీ చేశారు. ఇప్పుడు నిర్వహించే వేడుకలకు సంబంధించి 2023–24 లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకుంటే వీరికి కులపతి హోదాల గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరై విద్యార్థులకు అందజేస్తారు. వేడుకల నిర్వహణ తేదీ, అనుమతికి ఇప్పటికే వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్ గవర్నర్‌ను గత నెల 17వ తేదీన కలిసి విన్నవించారు.



జేఎన్‌టీయూకే యూనివర్సిటీ

దరఖాస్తు చేసుకోవాలి



జేఎన్‌టీయూకే అనుబంధ కళాశాలలలో ఇంజినీరింగ్ లేదా ఫార్మా, మేనేజ్‌మెంట్ విద్యను పూర్తిచేసిన అభ్యర్థులు ఒరిజనల్ డిగ్రీ (పట్టా) కోసం బీటెక్, ఎంటెక్ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు గడవు ఏప్రిల్ 15వ తేది వరకూ పెంచాం. గవర్నర్ అనుమతి వచ్చిన వెంటనే తేదీ ప్రకటిస్తాం.

– ప్రొఫెసర్ నాగేశ్వరరావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్, జేఎన్‌టీయూకే

కాలువలోకి దూసుకెళ్లిన స్కూలు వ్యాన్



కాలువలో తిరగబడిన వ్యాన్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

- ఢీకొట్టి వెళ్లిపోయిన లారీ
- ఏడుగురు విద్యార్థులు, డ్రైవరుకు గాయాలు
- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

పిఠాపురం: పాఠశాలకు విద్యార్థులను తీసుకెళుతున్న స్కూలు వ్యాన్ ప్రమాదానికి గురై పంట కాలువలోకి దూసుకెళ్లడంతో ఏడుగురు విద్యార్థులు, డ్రైవరుకు గాయాలయిన ఘటన గొల్లప్రోలు మండలం చెందుర్తిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గొల్లప్రోలుకు చెందిన ఒక ప్రైయివేటు స్కూలు వ్యాన్ సోమవారం ఉదయం గొల్లప్రోలు మండలం చెందుర్తిలో విద్యార్థులను ఎక్కించుకుని గొల్లప్రోలు బయలుదేరింది. గ్రామ శివారుకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఒక లారీ వేగంగా వచ్చి ఢీకొట్టి వెళ్లిపోవడంతో స్కూలు వ్యాన్ ఒక్కసారిగా అదుపుతప్పి పక్కనే ఉన్న పంట కాలువలోకి దూసుకెళ్లింది. దీంతో వ్యాన్ పంట కాలువలో తిరగబడడంతో వ్యాన్‌లో ఉన్న జి.హర్షిత, జి.అపర్ణ, జి.సిద్ధు, జి.ధరణి, కె.భార్గవ్, కె.హాసిని, నిహారిక, వ్యాన్ డ్రైవరు వెంకటేష్‌కు గాయాలయ్యాయి. ప్రమాదాన్ని చూసిన పక్కనే పంట పొలాల్లో పనులు చేసుకుంటున్న రైతులు వ్యాన్‌లో ఉన్న విద్యార్థులను సురక్షితంగా బయటకు తీశారు. వారిని పిఠాపురంలో ఒక ప్రైయివేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. వ్యాన్ డ్రైవరుకు కాలు విరగగా మిగిలిన విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఎస్సై ఎస్.రామకృష్ణ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి కారణంగా చెబుతున్న లారీ ఆపకుండా వెళ్లి పోయినట్లు చెబుతున్నారు. గొల్లప్రోలు పోలీసులు కేసు విచారణ చేపట్టారు. ప్రమాదం జరిగే సమయంలో సమయస్ఫూర్తిగా వ్యవహరించి వేగంగా కాలువలోకి దూసుకెళ్లకుండా డ్రైవరు జాగ్రత్తలు తీసుకోవడంతో పెను ప్రమాదం తప్పినట్లు విద్యార్థులు చెబుతున్నారు. కాలువలో నీరు సైతం తక్కువగా ఉండడం వల్ల విద్యార్థులు ప్రాణాలతో బయటపడినట్లు ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. ఈ ఘటనతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందారు.

జిల్లా జడ్జిల బదిలీ

కాకినాడ లీగల్: జిల్లా జడ్జిలను బదిలీ చేస్తూ హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వివరాలివీ...

న్యాయమూర్తి	ప్రస్తుతం పనిచేస్తున్న స్థలం	బదిలీ అయిన ప్రాంతం
పి. కమలాదేవి	కాకినాడ 3వ అదనపు జిల్లా జడ్జి	1వ అదనపు జిల్లా జడ్జి కోర్టు, కర్నూలు
నిఖిత ఆర్.వి	కాకినాడ 6వ అదనపు జిల్లా జడ్జి	ఫ్యామిలీ కోర్టు కం 6వ అదనపు జిల్లా జడ్జి కోర్టు, నెల్లూరు
పి.గోవర్ధన్	12వ అదనపు జిల్లా జడ్జి, విశాఖపట్నం	6వ అదనపు జిల్లా జడ్జి కోర్టు, కాకినాడ
జి.ఆనంది	పోక్సో కోర్టు, విశాఖపట్నం	3వ అదనపు జిల్లా జడ్జి కోర్టు, కాకినాడ
డి.విజయ గౌతమ్	రాజమహేంద్రవరం 5వ అదనపు జిల్లా జడ్జి	12వ అదనపు జిల్లా జడ్జి కోర్టు, విశాఖపట్నం
ఆర్.శ్రీలత	రాజమహేంద్రవరం ప్రత్యేక ఎస్సీ,ఎస్టీ కోర్టు కం 10వ అదనపు జిల్లా జడ్జి	7వ అదనపు జిల్లా జడ్జి, మదనపల్లి
పి.వి.ఎస్. సూర్యనారాయణమూర్తి	ఏసీబీ కోర్టు, రాజమహేంద్రవరం	2వ అదనపు జిల్లా జడ్జి కోర్టు, మదనపల్లి
ఎస్.ఉమాసునంద	పోక్సో కోర్టు, ఏలూరు	10వ అదనపు జిల్లా జడ్జి కోర్టు, రాజమహేంద్రవరం
ఎ.వసంతి	12వ అదనపు జిల్లా జడ్జి, పిఠాపురం	10వ అదనపు జిల్లా జడ్జి కోర్టు, నరసాపురం
ఎం.శ్రీహరి	4వ అదనపు జిల్లా జడ్జి, గూటి, అనంతపురం జిల్లా	12వ అదనపు జిల్లా జడ్జి, పిఠాపురం
ఎం.శంకరరావు	అదనపు జిల్లా జడ్జి, రామచంద్రపురం	పోక్సో కోర్టు, చిత్తూరు
వి.నరేష్	2వ అదనపు జిల్లా జడ్జి, అమలాపురం	10వ అదనపు జిల్లా జడ్జి, అనకాపల్లి

ఇద్దరి అరెస్టు : 12 మోటార్ సైకిళ్లు స్వాధీనం

కొత్తపల్లి: చెడు వ్యసనాలకు బానిసలై మోటార్ సైకిళ్ల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేశామని పిఠాపురం సీఐ వి. శ్రీనివాస్ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్ వద్ద సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మార్చి 30వ తేదీన యండపల్లిలో జరిగిన నూకాలమ్మతల్లి జాతరలో ఉమ్మిడి నాగేశ్వరరావు మోటార్ సైకిల్ దొంగతనానికి గురైంది. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మండలంలోని కొమరగిరి శివారు జగనన్న కాలనీ సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఉప్పాడకు చెందిన సూరాడ బాబు, చింతకాయల ఏసేబులను అరెస్టు చేసి దర్యాప్తు చేయగా వారి వద్ద నుంచి 12 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జిల్లా పరిధిలో కొత్తపల్లి-5, పిఠాపురం టౌన్-3, గొల్లప్రోలు, తొండంగి, కాకినాడ పోలీసు స్టేషన్ పరిధిలో దొంగతనాలకు గురైన 12 మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మండలంలోని రామన్నపాలెంలో ఉన్న పాత ఇనుప సామాన్లు కొనుగోలు చేస్తున్న దొంగల నూకరాజుపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్సై వెంకటేష్ పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య



రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రమణబాబు (ఫైల్)

తుని: క్రికెట్ బెట్టింగ్‌లో సొమ్ము కోల్పోయిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కోలనాటి రమణబాబు (33) ఆత్మహత్య చేసుకున్నాడని తుని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవా రం అందిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం నక్కపల్లి గ్రామానికి రమణబాబు వర్క్ ఫ్రం హోంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. నెలవారీ వస్తున్న జీతం ఇంటికి ఇవ్వకుండా బెట్టింగ్‌కి అలవాటు పడి సొమ్ము పోగొట్టుకున్నాడు. అప్పుల బాధతో నర్సీపట్నం- రేగు పాలెం మధ్యలో రైలు పట్టాల పై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి వద్ద లభించిన సెల్ ఫోన్ ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కారు ఢీకొని మాంసం వ్యాపారి అపస్మారక స్థితికి

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మాంసం వ్యాపారికి తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గొల్లప్రోలు నగర పంచాయతీకి చెందిన పిల్లి అప్పారావు ఉదయం మేకల కొనుగోలు చేసుకోవడానికి గొల్లప్రోలు నుంచి చేబ్రోలు మోటార్ సైకిల్‌పై వెళుతుండగా వెనక నుండి కారు వేగంగా వచ్చి శ్రీనివాస రైస్‌మిల్లు ఎదురుగా ఢీకొనటంతో అప్పారావుకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో బాధితుడు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే అదే కారులో పిఠాపురం గవర్నమెంట్ హాస్పిటల్‌కు, అక్కడ నుంచి కాకినాడలో ఒక ప్రైయివేటు హాస్పటల్‌కు తరలించగా చికిత్స పొందుతున్నాడు. అప్పారావు పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్య కాదు హత్యే అంటూ నిరసన


పోలీసుల అదుపులో 17 మంది



ఫంక్షన్ హాల్ వద్ద నిరసనకు దిగిన వారిని అడ్డుకుంటున్న పోలీసులు

సీతానగరం: మండలంలోని రాపాక పంచాయతీ పరిధిలోగల శ్రీరామనగరంలోగల రాజుగారి కల్యాణ మండపంలో ఆదివారం రామచంద్రపురానికి చెందిన వేమగిరి సునీల్ (26) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోలేదని, అది హత్యేనంటూ బంధువులు, స్నేహితులు రాజుగారి గార్డెన్ ఫంక్షన్ హాల్ వద్ద నిరసన చేపట్టారు. సోమవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి సునీల్ మృతదేహం అంబులెన్స్‌లో తీసుకువచ్చి ఫంక్షన్ హాల్ వద్ద నిరసన తెలిపారు. మృతదేహాన్ని అంబులెన్స్ నుంచి కిందకు దించే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ఫంక్షన్ హాల్ యజమాని రాజు, హైదరాబాద్ నుంచి వచ్చిన మహిళ సునీల్‌ను హత్య చేశారని, వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. కోరుకొండ ఇన్‌చార్జి సీఐ, రాజమహేంద్రవరం క్రైమ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ఈ బాలసౌరి అక్కడికి వచ్చారు. సీతానగరం – రాజమహేంద్రవరం రోడ్డుపై ధర్నాకు ప్రయత్నించగా ఎస్సై డి.రామ్‌కుమార్ తన సిబ్బందితో అడ్డుకుని 17 మందిని అదుపులోకి తీసుకుని కోరుకొండ తరలించారు. ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ బాలసౌరి విలేకరులతో మాట్లాడుతూ మృతుడు సునీల్‌కు వరుసకు మరదలైన మహిళ హైదరాబాద్ నుంచి ఆదివారం ఉదయం ప్రయివేట్ బస్‌లో సీతానగరం చేరుకుందని, రాజు గారి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో గది తీసుకున్నారన్నారు. సాయంత్రం 4 గంటలకు మహిళ బాత్‌రూమ్‌కు వెళ్లి తిరిగి వచ్చే సరికి సునీల్ ఉరివేసుకుని ఉన్నాడని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

రూ.10 లక్షల విలువైన రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యంతో పట్టుబడిన వాహనాలు

రాజానగరం: జాతీయ రహదారిపై జీఎస్ఎల్ వైద్య కళాశాల సమీపంలో అక్రమంగా తరలిస్తున్న రూ.10 లక్షలు విలువ చేసే రేషన్ బియ్యాన్ని సోమవారం పట్టుకున్నామని స్థానిక డిప్యూటీ తహసీల్దారు (పౌరసరఫరాలు) గొలుగూరి బాపిరాజు తెలిపారు. మూడు వాహనాలలో తరలిస్తున్న ఈ బియ్యాన్ని వాహనాలతో సహా స్వాధీన పర్చుకుని, కేసులు నమోదు చేసేందుకు రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. గొల్లప్రోలుకు చెందిన ఆకుల స్వామి, పెద్దాపురం మండలం గోరంట్లకు చెందిన కోన బాలరాజు, కోరుకొండ అచ్చిరాజు తమ వాహనాలలో ఈ బియ్యాన్ని తరలిస్తూ పట్టుబడ్డారు. వారిపై కూడా కేసులు నమోదు చేయడంతోపాటు ఈ అక్రమ దందాకు ప్రధాన కారకులు ఎవరనే విషయమై ఆరా తీస్తున్నామని చెప్పారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.10 లక్షలు కాగా, వాహనాల విలువ రూ.20 లక్షలు పైబడి ఉంటుందన్నారు.